సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం । 16 । మే । 2023



దారికాచిన మృత్యువు
కాసేపట్లో గమ్యం చేరాల్సిన వారిని రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. ఏడుగురు చనిపోయారు.

8లో



చీనీ టన్ను రూ.36 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.36 వేలు పలికాయి. మార్కెట్‌కు 474 టన్నుల చీనీకాయలు అమ్మకానికి రాగా.. వాటిని ఈ-నామ్ పద్ధతిలో వేలం వేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
41.2°/23.8°

జిల్లా అంతటా సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు పెరిగాయి. దీంతో వేసవితాపం, ఉక్కపోత అధికంగా ఉంది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఖాద్రీ ఆలయంలో బహిరంగ వేలం
కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, అనుబంధంగా ఉన్న ఉమామహేశ్వర స్వామి ఆలయంలో వివాహాలకు వాయిద్యాలు వాయించేందుకు ఆలయంలో 24న ఉదయం 10:30 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఈఓ పట్టెం గురుప్రసాద్ తెలిపారు. ఒక సంవత్సరం పాటు హక్కు కోసం వేలం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వేలంలో పాల్గొనే వారు రూ.50 వేల ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

టెండర్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అన్నదానానికి నిత్యం కావాల్సిన కూరగాయలు సరఫరా చేసేందుకు ఒక సంవత్సరం పాటు హక్కు కోసం టెండర్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ, ఈఓ పట్టెం గురుప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 23 లోపు దేవస్థాన కార్యాలయంలో రూ.500 చెల్లించి టెండర్ ఫారాలు తీసుకోవాలన్నారు. అనంతరం ధరావత్తు రూ.5 వేలు చెల్లించి రశీదు పొందాలన్నారు. 24న ఉదయం 11 గంటల్లోపు టెండర్ బాక్స్‌లో ఫారాలను వేయాలన్నారు. అదే రోజు ఉదయం 11.30 గంటలకు అందరి సమక్షంలో టెండర్ బాక్స్‌ను తెరుస్తామని చెప్పారు.

కట్టుదిట్టంగా ఏపీఈఏపీసెట్



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏపీ ఈఏపీసెట్ చైర్మన్ జింకా రంగజనార్దన

అనంతపురం: ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న ఏపీ ఈఏపీసెట్-2023 సోమవారం ప్రారంభమైంది. తొలిరోజు ఇంజినీరింగ్ స్ట్రీమ్‌కు సంబంధించిన పరీక్ష మూడు సెషన్లలో కట్టుదిట్టంగా నిర్వహించారు. శ్రీసత్యసాయి జిల్లాలో ఉదయం సెషన్‌లో 101 మంది, మధ్యాహ్నం సెషన్‌లో వరుసగా 97 మంది, 198 మంది మొత్తం 396 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఇదిలా ఉండగా, అనంతలక్ష్మీ ఇంజినీరింగ్ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని ఏపీ ఈఏపీసెట్ చైర్మన్ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన పరిశీలించారు.

డీసీఈబీ కార్యాలయం ప్రారంభం



డీసీఈబీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డీఈఓ మీనాక్షి

ప్రశాంతి నిలయం: డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కార్యాలయాన్ని డీఈఓ మీనాక్షి సోమవారం సాయంత్రం ప్రారంభించారు. జిల్లాకు సంబంధించిన కార్యాకలాపాలు నిర్వహించేందుకు అనువుగా కొత్తచెరువు బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డీసీఈబీ కార్యాలయం ఏర్పాటు చేశారు. డీఈఓ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సంబంధించిన రికార్డ్ షీట్‌లు, టీసీ పుస్తకాలు డీసీఈబీ ద్వారానే అందించాలని సెక్రెటరీ ఎస్.భాస్కర్‌రెడ్డిని ఆదేశించారు.

చూడ చక్కని ఇళ్లు



ఇతని పేరు పార్థసారథి. కదిరి పట్టణంలో అద్దె ఇంట్లో కాపురం ఉంటూ బార్బర్ షాప్‌తో జీవనం సాగిస్తున్నారు. సొంతిల్లు ఉండాలనేది ఈయన చిరకాల కోరిక. టీడీపీ హయాంలో ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నా ప్రయోజనం లేకపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే ఇతని భార్య శారదమ్మ పేరుమీద ఇల్లు మంజూరు అయింది. ప్రభుత్వం ఇచ్చిన డబ్బుతో పాటు తన దగ్గరున్న మరి కొంత డబ్బుతో వైఎస్సార్ జగనన్న కాలనీలో సొంతిల్లు నిర్మించుకుంటున్నారు. సొంతింటి కల సాకారమవుతుండటంతో పార్థసారథి ఆనందానికి అవధులు లేవు. జగనన్న కాలనీల్లో ఇల్లు మంజూరైన ప్రతి ఒక్కరూ తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

'వైఎస్సార్- జగనన్న' కాలనీల్లో జోరుగా ఇళ్ల నిర్మాణాలు

- సాకారమవుతున్న పేదల సొంతింటి కల
- అన్ని మౌలిక వసతులతో జగనన్న కాలనీల ఏర్పాటు
- కొన్నింటిలో ఇప్పటికే గృహ ప్రవేశాలు



కదిరిలో 'వైఎస్సార్-జగనన్న' కాలనీలో ఇళ్ల నిర్మాణాలు

కదిరి: ఏళ్ల తరబడి పూరి గుడిసెల్లో.. అద్దె ఇళ్లల్లో అవస్థలు పడుతున్న పేద, మధ్య తరగతి ప్రజలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలిచింది. వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు చేపట్టి రూ.లక్షలు విలువ చేసే స్థిరాస్తి పేదల సొంతమయ్యేలా చేస్తోంది. పేదల సొంతింటి కల సాకారమయ్యేలా చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

జోరుగా ఇళ్ల నిర్మాణం

జిల్లా వ్యాప్తంగా ఉన్న 'వైఎస్సార్-జగనన్న కాలనీ'ల్లో రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున చేపట్టిన పేదల ఇళ్ల నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. 'వైఎస్సార్-జగనన్న' లేఅవుట్లలో విద్యుత్ స్తంభాలు నాటడం, వైర్లు లాగడం, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు లాంటి పనులు చక చకా జరిగి పోయాయి. నిర్మాణం పూర్తయిన కొన్ని ఇళ్లకు విద్యుత్‌తో పాటు నీటి సరఫరా కనెక్షన్ కూడా ఇచ్చారు. ఇళ్ల నిర్మాణం కోసం ప్రతి కాలనీలో నీటి సమస్య లేకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంది. దీంతో పేదలంతా పోటీ పడి తమకు మంజూరైన ఇంటిని నిర్మించుకుంటున్నారు. పలు చోట్ల ఇప్పటికే కొందరు తమ ఇంటి నిర్మాణం పూర్తి చేసి గృహ ప్రవేశాలు కూడా చేశారు.

9122 ఇళ్లు పూర్తి

జిల్లాలో మొత్తం 168 వైఎస్సార్-జగనన్న' లేఅవుట్లు వేశారు. వీటి పరిధిలో 62,716 మంది ఇల్లులేని మహిళలకు ఇళ్లు మంజూరు చేశారు. పునాది దశలో 14,151, పైకప్పు దశలో 2,534, పూర్తయినవి 9,122 ఉన్నాయి. మిగిలిన ఇళ్లు ప్రారంభ దశలో ఉన్నాయి. పట్టణ పరిధిలో ఒక సెంటు, గ్రామీణ పరిధిలో ఒకటిన్నర సెంటు స్థలాన్ని ఇంటి నిర్మాణం కోసం ఇచ్చారు. ఇందుకు సంబంధించిన పట్టాలు సైతం వారికి కేటాయించిన ఇంటి స్థలం వద్దే ఇచ్చారు.

జిల్లాలో నిర్మిస్తున్న ఇళ్ల వివరాలు

నియోజకవర్గం	నిర్మిస్తున్న ఇళ్లు
పుట్టపర్తి	18,720
కదిరి	3,271
మడకశిర	497
పెనుకొండ	6,295
హిందూపురం	11,868
ధర్మవరం	14,466
రాప్తాడు	7,599
మొత్తం	62,716

మళ్లీ జగనన్నే రావాలి



నేను ఒంటెద్దు బండి పెట్టుకొని జీవనం సాగిస్తున్నా. నా కూతురి పేరు మీద జగనన్న ఇల్లు ఇచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన డబ్బుకు ఇంకొంత కలిపి ఇల్లు కట్టుకుంటున్నాను. రాష్ట్రంలో జగనన్న కాలనీలతో పాటు రాష్ట్రం అభివృద్ధి జరగాలంటే మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలి. ఇది నాలాంటి పేదోళ్లందరి అభిప్రాయం. **–షేక్ అల్లాబకష్ , కదిరి**

సకాలంలో బిల్లులు



'వైఎస్సార్-జగనన్న' కాలనీల్లో ఇల్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లిస్తోంది. ప్రతి చోటా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాం. పూర్తయిన ఇళ్లకు కరెంటుతో పాటు మంచినీటి కొళాయి కనెక్షన్ కూడా ఇస్తున్నాం. ఇల్లు మంజూరైన ప్రతి ఒక్కరూ సకాలంలో ఇల్లు నిర్మించుకొని సొంతింటి కల సాకారం చేసుకోవాలి. **– చంద్రమౌళీశ్వరరెడ్డి, జిల్లా హౌసింగ్ పీడీ**

సమస్యలను సత్వరం పరిష్కరించాలి



నడవలేనిస్థితిలో ఉన్న వృద్ధురాలి వద్దకే వెళ్లి సమస్యను అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ మాధవరెడ్డి

కొత్తచెరువు: నడవలేని వృద్ధులు, దివ్యాంగుల వద్దకే వెళ్లి సావధానంగా వారి సమస్యలను తెలుసుకున్నారు ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి. ఎస్పీ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చిన ప్రతి అర్జీదారుడితో ఎస్పీ స్వయంగా మాట్లాడారు. స్పందన కార్యక్రమంలో 54 పిటీషన్లను స్వీకరించారు. ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ స్పందనకు వచ్చే అర్జీలు మరోసారి పునరావృతం కాకుండా చూడాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సత్వరమే సమస్యలకు పరిష్కారం చూపాలని సూచించారు. కుటుంబ కలహాలు, భర్త వేధింపులు, అదనపు కట్నం, భూ వివాదాలు, ఆర్థిక మోసాలకు సంబంధించిన అర్జీలే ఎక్కువగా వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పోలీసు లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి, ఎస్పీ సీఐ రవీంద్రారెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విఠల.. విఠల.. పాండురంగ..



బొమ్మనహాళ్: ఆంధ్ర పండరీపురంగా ప్రసిద్ధిచెందిన ఉంతకల్లులో రుక్మిణీ పాండురంగస్వామి రథోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. పాండురంగస్వామి ఆలయం నుంచి బసవన్న ఆలయం వరకు రథాన్ని లాగారు. వేలాది మంది భక్తులు రథోత్సవంలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలి

- అర్హులకు సంక్షేమ ఫలాలు అందాలన్నదే సీఎం జగన్ ఆకాంక్ష
- ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి



చిలమత్తూరు: మాట్లాడుతున్న పోతిరెడ్డి నాగార్జునరెడ్డి

చిలమత్తూరు/లేపాక్షి: ప్రజాప్రతినిధులతో ఉద్యోగులు సఖ్యతగా మెలగడంతో పాటు సమన్వయంతో పనిచేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి సూచించారు. సోమవారం ఆయనతో పాటుగా జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జిల్లా అధికారులు చిలమత్తూరుతో పాటు లేపాక్షి మండలాల్లో పర్యటించారు. తొలుత చాగలేరు, మొరసలపల్లి పంచాయతీ పరిధుల్లో గ్రామీణ ఉపాధి పనులను పరిశీలించి ఉపాధి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పనుల కల్పనలో అలసత్వం ఉండకూడదని, ఉపాధి కూలీలందరికీ పనులు కల్పించాలన్నారు. అనంతరం సోమఘట్టలో జగనన్న కాలనీని పరిశీలించి, గ్రామ సచివాలయ ఉద్యోగులతో మాట్లాడారు. అనంతరం కొడికొండలో సచివాలయ భవన నిర్మాణాలను తనిఖీ చేశారు. టేకులోడు క్రాస్‌లోని జగనన్న కాలనీని సందర్శించిన ఆయన దేమకేతేపల్లి గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సాయంత్రం మండల కేంద్రంలోని ఆర్బీకేలో అధికారులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నాగార్జున రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సచివాలయ ఉద్యోగులు వారధిలా పనిచేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతోందన్నారు.

అందుబాటులో లేకపోతే చర్యలు

రాష్ట్రంలో సచివాలయాల ఉద్యోగులు బాధ్యతగా పని చేయాలని, ప్రజలు, ప్రజాప్రతినిధులను గౌరవించాలని రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సలహాదారు పోతిరెడ్డినాగార్జునరెడ్డి తెలిపారు. సోమవారం లేపాక్షి మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ కార్యక్రమానికి నాగార్జునరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ చాలా చోట్ల గ్రామ సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని, ప్రజా సమస్యలను కూడా సత్వరం పరిష్కరించడం లేదన్న ఫిర్యాదు అందాయన్నారు. సచివాలయ ఉద్యోగులు అనుమతి తీసుకోకుండా వెళితే చర్యలు తప్పవన్నారు. ప్రజలకు అందుబాటులో సమస్యలు పరిష్కరించాలన్నారు. అంతకు ముందు లేపాక్షిలోని 2, 3 సచివాలయాలను తనిఖీ చేశారు.

పౌష్టికారం అందేలా చూడండి

గ్రామ సచివాలయ వ్యవస్థ ప్రజలకు ఎంతో ఉపకరిస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. భవిష్యత్‌లో సచివాలయాల్లో మరిన్ని విస్తృత సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. సంక్షేమ పథకాలు ఇలా పారదర్శకంగా లబ్దిదారులకు చేరిన దాఖలాలు దేశంలో మరెక్కడా లేదన్నారు. 10వ తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచాలని, విద్యార్థులతో పాటు అంగన్‌వాడీ పిల్లలకు నాణ్యమైన ఆహారం అందుతుందా? లేదా? అధికారులు ఆరా తీయాలన్నారు.

లేపాక్షి ఆలయం సందర్శన

లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయాన్ని సోమవారం మధ్యాహ్నం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో పాటు అధికారులు సందర్శించారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయంలో శిల్పాలు, చిత్రలేఖనాలను తిలకించారు.

ప్రభుత్వ సంక్షేమ క్యాలెండర్ ఆవిష్కరణ



సంక్షేమ పథకాల క్యాలెండర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, అధికారులు

పుట్టపర్తి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం అర్హులైన లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. సోమవారం రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ రూపొందించిన జగనన్న ప్రభుత్వ సంక్షేమ క్యాలెండర్ 2023-24ను కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ చేతన్, డీఆర్‌ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, డీఈఓ మీనాక్షి, డీపీఆర్‌ఓ వేలాయుధం, డీఎంహెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి, పీఆర్ ఎస్ఈ గోపాల్‌రెడ్డి తదితరులు ఆవిష్కరించారు. అనంతరం కలెక్టరేట్‌లో పట్టు పరిశ్రమశాఖ ఆధ్వర్యంలో కూడా వివిధ పథకాలు, యాక్టివిటీలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో పోస్టర్లను ప్రదర్శించాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. పట్టు పరిశ్రమల ద్వారా రైతులకు అధిక దిగుబడి, ఆదాయాన్ని పొందే విధంగా సమాయత్తం చేయాలన్నారు. కార్యక్రమంలో పట్టు పరిశ్రమశాఖ జేడీ పద్మమ్మ, సీపీఓ విజయ్‌కుమార్, జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఫిషరీస్ ఏడీ చంద్రశేఖర్‌రెడ్డి, పశుసంవర్ధకశాఖ ఏడీ శుభదాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు, రేపు జెడ్పీ స్టాండింగ్ సమావేశాలు

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ స్థాయీ సంఘం సమావేశాలు మంగళ, బుధవారాల్లో జరగనున్నాయి. ఈ మేరకు జిల్లా పరిషత్ అధికారులు సోమవారం ప్రకటన విడుదల చేశారు. తొలి రోజు స్థాయీ సంఘం-1, 3, 7(ఆర్థిక, ప్రణాళిక/వ్యవసాయం/ఇంజినీరింగ్ విభాగాలు) సమావేశాలు జెడ్పీ సమావేశ భవన్‌తో పాటు అదనపు సమావేశ భవనాల్లో జరుగుతాయన్నారు. మలి రోజు స్థాయీ సంఘం-2, 4, 5, 6(గ్రామీణాభివృద్ధి/విద్య, వైద్య/స్త్రీ-శిశు సంక్షేమం/సాంఘిక సంక్షేమ శాఖలు) నిర్వహించనున్నారు. ఆయా శాఖల అధికారులు సమగ్ర సమాచారంతో సమావేశాలకు హాజరు కావాలని కోరారు.

స్పందనకు అర్జీదారుల క్యూ

పట్టా మంజూరు చేయండయ్యా



తనకల్లు మండలం నారేవాండ్లపల్లిలోని సర్వే నంబర్ 729-2లో ఉన్న 2.14 ఎకరాల భూమిని తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్నామని జెన్నే చలపతి తెలిపారు. 2017లో కురిసిన వర్షాలకు ఇల్లు కూలిపోయి భూమికి సంబంధించిన పత్రాలు, శిస్తు కట్టిన రసీదులు పోయాయన్నారు. సాగుదారులకు కాకుండా ఇతరులకు సదరు భూమిపై డీ పట్టా మంజూరు చేశారని కలెక్టర్‌కు విన్నవించారు. చుట్టుపక్కల ఉన్న రైతులను విచారించి తనకు న్యాయం చేయాలన్నారు. తనకు పట్టా మంజూరు చేయాలని కోరారు.

ట్రై స్కూటర్ మంజూరు చేయండి



తనకు అన్ని అర్హతలూ ఉన్నాయని ట్రై స్కూటర్ మంజూరు చేయాలని ధర్మవరానికి చెందిన మహేంద్ర అనే దివ్యాంగుడు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని ఇంటర్వ్యూకు హాజరైనట్లు తెలిపారు. తన భార్య సైతం దివ్యాంగురాలేనని, ట్రై స్కూటర్ మంజూరు చేస్తే దానితో ఉపాధి పొందుతానని తెలియజేశారు.

భూమి ఆక్రమించారు



ముదిగుబ్బ మండలం సానేవారిపల్లి గ్రామంలో ప్రభుత్వం సర్వే నంబర్ 504-1లో రెండు సెంట్లు పట్టా ఇచ్చిందని, అయితే ఆ భూమిని సోమశేఖర్ అనే వ్యక్తి ఆక్రమించుకున్నారని అదే గ్రామానికి చెందిన గంగులప్ప భార్య లక్ష్మీదేవి కలెక్టర్‌కు తెలిపారు. న్యాయం చేయాలని వేడుకున్నారు.

- న్యాయం చేయాలని అధికారులకు వేడుకోలు
- గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, తదితరులు

పుట్టపర్తి అర్బన్: జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి అర్జీదారులు క్యూ కట్టారు. న్యాయం చేయండయ్యా అని కలెక్టర్ అరుణ్‌బాబుతో పాటు ఇతర అధికారులకు అర్జీలు సమర్పించారు. మొత్తం 171 మంది తమ వినతులను అధికారులకు ఇచ్చారు. కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందనతో పాటు జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా భావిస్తోందన్నారు. జగనన్నకు చెబుదాంలో నమోదయ్యే సమస్యలను ఆయా శాఖల అధికారులు వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమాన్ని సీఎంఓ కార్యాలయం మానిటర్ చేస్తుండటంతో అధికారులపై మరింత బాధ్యత ఏర్పడిందన్నారు. ప్రజల సమస్యలను, సూచనలను 1902కు కాల్ చేసి తెలియజేయవచ్చన్నారు. స్పందనలో వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించాలన్నారు. రీ ఓపెన్ పిటీషన్లు 51 ఉన్నాయని, వాటికి నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. క్షేత్రస్థాయిలో తహసీల్దార్, ఆర్డీఓ పర్యవేక్షించాలని సూచించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ చేతన్, డీఆర్‌ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ వివిధ శాఖల అధికారులు స్పందనలో పాల్గొన్నారు.

టీడీపీలో భగ్గుమన్న విభేదాలు

- యువగళం సంఘీభావ యాత్రలో తేటతెల్లం
- సవితమ్మ వర్గీయులపై బీకే పార్థసారథి అసహనం
- సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోన్న వీడియో



సవితమ్మ వర్గీయులపై అసహనం వ్యక్తం చేస్తున్న బీకే పార్థసారథి

సాక్షి, పుట్టపర్తి: తమ్ముళ్ల మధ్య విభేదాలు మరోసారి బట్టబయలయ్యాయి. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నిర్వహిస్తున్న యువగళం పాదయాత్ర 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా పెనుకొండ నియోజకవర్గంలో సంఘీభావ యాత్ర నిర్వహించారు. అయితే సవితమ్మ వర్గీయులపై టీడీపీ పెనుకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి బీకే పార్థసారథి అసహనం వ్యక్తం చేసిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. సంఘీభావ యాత్రలో తనతో పాటు తన వర్గీయులే ముందుండాలని బీకే హుకుం జారీ చేశారు. అయితే సవితమ్మ వర్గీయులు వినకుండా ముందు నడవసాగారు. దీంతో కాసేపు గందరగోళం నెలకొంది.

ప్రారంభం నుంచీ అంతే..

పెనుకొండ నియోజకవర్గం పరిగి మండల కేంద్రం నుంచి పైడేటి గ్రామం వరకు యువగళం సంఘీభావ యాత్ర నిర్వహించారు. ఆరంభంలోనే ఇరు వర్గాల మధ్య విభేదాలు తలెత్తాయి. ఫలితంగా మధ్యాహ్నం 3 గంటలకు మొదలైన పాదయాత్ర సాయంత్రం 6 గంటలకు ముగిసింది. అదే పాదయాత్రలో నిమ్మల కిష్టప్ప కూడా ఉన్నారు. అయితే తన వర్గం మౌనం వహించడంతో 'తమ్ముళ్ల'కు అర్థం కాలేదు.

టికెట్ కోసం ఆరాటం

పెనుకొండ ఎమ్మెల్యే టికెట్ కోసం టీడీపీలో సవితమ్మ, బీకే పార్థసారథి మధ్య కొన్ని రోజులుగా పోటీ నెలకొంది. దీంతో సవితమ్మ వర్గం వెలుగులోకి రాకుండా చూసేందుకు బీకే పార్థసారథి నానా తంటాలు పడుతున్నారు. ఎలాగైనా టికెట్ తనకే కచ్చితం చేసుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో సవితమ్మ నిర్వహించే ప్రతి కార్యక్రమాన్ని బీకే అడ్డుకోవాలని చూడటం గమనార్హం.

పాదయాత్రకు జనం కరువు



హనుమాన్ కూడలిలో జనం లేక బోసిపోయిన టీడీపీ సభ

పుట్టపర్తి టౌన్: నియోజకవర్గంలో సోమవారం నిర్వహించిన యువగళం సంఘీభావ పాదయాత్రకు జనం నుంచి స్పందన కరువైంది. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, మాజీ ఎంపీ నిమ్మల క్రిష్టప్ప పుట్టపర్తితో పాటు కర్ణాటక నాగేపల్లి, బుక్కపట్నం మీదుగా కొత్తచెరువు వరకు యాత్ర నిర్వహించారు. ద్వితీయ శ్రేణి నాయకులు కూడా డుమ్మా కొట్టడం, జనాలు లేకపోవడంతో వచ్చిన అరకొర కార్యకర్తలతోనే కార్యక్రమాన్ని మమ అనిపించారు.

అబార్షన్ వికటించి గర్భిణి మృతి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: గర్భస్థ పిండం లింగ నిర్ధారణతో పుట్టబోయేది ఆడపిల్లగా నిర్ధారించి, అబార్షన్ చేసే క్రమంలో గర్భిణి ప్రాణాలను బలిగొన్న ఓ ప్రైవేట్ వైద్యురాలి నిర్వాకం అనంతపురంలో కలకలం రేపింది. వివరాలు... శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మండలం చిగిచెర్ల గ్రామానికి చెందిన కవిత (25), హనుమంతు దంపతులు. వీరికి ఇద్దరు కుమార్తెలున్నారు. మూడోసారి గర్భం దాల్చడంతో కవితకు పుట్టబోయేది కొడుకా? కూతురా? అనేది నిర్ధారించుకునేందుకు అనంతపురంలోని శ్రీనివాస నగర్‌లో ఉన్న రూత్ క్లినిక్‌కు దంపతులు వచ్చారు. ఆమెను పరీక్షించిన వైద్యురాలు లక్ష్మీకాంతమ్మ.. లింగ నిర్ధారణ పరీక్ష చేయించారు. పుట్టబోయేది ఆడపిల్లగా నిర్ధారించి అబార్షన్ చేయించుకోవాలంటూ సర్ది చెప్పారు. దీనికి దంపతులు అంగీకరించడంతో ఆదివారం అబార్షన్ చేసి, అదే రోజు సాయంత్రం ఇంటికి పంపారు. సోమవారం కవిత పరిస్థితి విషమంగా మారడంతో కుటుంబసభ్యులు వెంటనే రూత్ క్లినిక్‌కు తీసుకొచ్చారు. డాక్టర్ లక్ష్మీకాంతమ్మ అక్కడ లేకపోవడంతో సిబ్బంది సూచన మేరకు ప్రభుత్వ సర్వజనాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే కవిత మృతి చెందినట్లు నిర్ధారించారు. బాధితుల ఫిర్యాదు మేరకు డాక్టర్ లక్ష్మీకాంతమ్మ కేసు నమోదు చేసినట్లు అనంతపురం మూడో పట్టణ పోలీసులు తెలిపారు.

దారి కాచిన మృత్యువు

- వైఎస్సార్ జిల్లా ఏటూరు వద్ద రోడ్డు ప్రమాదం
- సంఘటన స్థలంలోనే ఏడుగురు దుర్మరణం
- మృతుల్లో ఇద్దరు తాడిపత్రి వాసులు
- మిగిలిన వారంతా బంధువులే..

కాసేపట్లో గమ్యం చేరుకోవాల్సిన వారిని రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబళించింది. అక్కాచెల్లెళ్లు తమ కుటుంబాలతో తిరుమల దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఏడుగురు దుర్మరణం చెందారు. వీరిలో నలుగురు అక్కచెల్లెళ్లు, వారి ఇద్దరు కుమారులతో పాటు డ్రైవర్ ఉన్నారు. మృతుల్లో ఇద్దరు తాడిపత్రికి చెందిన తల్లీ కుమారుడు ఉన్నారు. ఎక్కడికెళ్లినా కలిసి వెళ్లే అక్కాచెల్లెళ్లు ఆఖరుకు మృత్యువులోనూ కలిసే వెళ్లిపోవడం అందరినీ కలచివేసింది. వివరాలిలా ఉన్నాయి.




మృతులు తల్లీ కుమారుడు వెంకటలక్ష్మి, సునీల్‌కుమార్‌రెడ్డి (ఫైల్)



వాహనంలో చిక్కుకున్న మృతదేహాలు

తాడిపత్రి అర్బన్: వైఎస్సార్ జిల్లా రైల్వే కొండాపురం నేదరపేటకు చెందిన వి.చెన్నారెడ్డి, లక్షుమమ్మ దంపతులకు ఆరుగురు కూతుళ్ల సంతానం. వీరిలో ఒకరు చనిపోయారు. మిగిలిన ఐదుగురిలో వెంకటలక్షుమ్మ పెద్దది. ఈమె భర్త కంచం ప్రసాద్‌రెడ్డి నాలుగేళ్ల క్రితం గుండెపోటుతో మరణించాడు. కంచం వెంకటలక్ష్మమ్మ (55) చిన్నకుమారుడు సునీల్ కుమార్‌రెడ్డి (27)తో కలిసి తాడిపత్రి కృష్ణాపురం నాలుగో రోడ్డులో అద్దె ఇంటిలో నివాసముంటోంది. ఈమె పెద్ద కుమారుడు సురేంద్రకుమార్‌రెడ్డి బళ్లారిలో వాటర్‌ప్లాంట్ నిర్వహి స్తూ అక్కడే నివాసముంటున్నాడు. అప్పుడప్పుడు తల్లిని చూసేందుకు తాడిపత్రి వచ్చి వెళ్తుంటాడు. చీరల వ్యాపారంతో పాటు టైలరింగ్ పని చేసే వెంకటలక్ష్మమకు చిన్న కుమారుడు వలంటీర్‌గా పనిచేస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటుండేవాడు.

అన్యోన్యతకు మారుపేరు ఆ అక్కాచెల్లెళ్లు..

వెంకటలక్ష్మమ్మ, ఆమె చెల్లెళ్లు ఎంతో అన్యోన్యంగా కలిసిమెలిసి ఉండేవారు. ఎక్కడికి వెళ్లినా అందరూ కచ్చితంగా కలిసివెళ్లేవారు. ఐకమత్యానికి ప్రతిరూపాలుగా ఉన్న వెంకటలక్ష్మమ్మ, ఆమె ముగ్గురు చెల్లెళ్లు బళ్లారికి చెందిన సిరయ్యగారి లక్ష్మీదేవి అలియాస్ బుజ్జి (39), కాటసాని సుభద్ర (35), వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగుకు చెందిన కాటసాని సుమలత(38) తిరుమల శ్రీవారి దర్శనం వెళదామని నిర్ణయించుకున్నారు. శనివారం అద్దె తూఫాన్ వాహనంలో అక్కచెల్లెళ్లు తమ కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు వెళ్లారు. స్వామికి మొక్కులు చెల్లించుకుని.. ఆనందంగా తిరుగుపయనమయ్యారు. వైఎస్సార్ జిల్లా రైల్వే కొండాపురం మండలం ఏటూరు గ్రామ సమీపంలోని బ్రిడ్జి వద్ద వీరి వాహనాన్ని ఎదురుగా వచ్చిన లారీ బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటలక్ష్మమ్మ, ఆమె కుమారుడు సునీల్‌కుమార్‌రెడ్డి, చెల్లెళ్లు లక్ష్మీదేవి, సుమలత, సుభద్ర,తో పాటు సుభద్ర కుమారుడు లిఖిత్‌కుమార్‌రెడ్డి(11), వైఎస్సార్ జిల్లా లింగాల మండలానికి చెందిన డ్రైవర్ సుధాకర్‌రెడ్డి (31) దుర్మరణం చెందారు. అర గంటలో తాడిపత్రికి చేరుకోవాల్సిన వారంతా విగతజీవులై రావడం బంధువుల్లో తీవ్ర విషాదం నింపింది.ఈ ప్రమాదంలో మరో ఐదుగురు గాయపడ్డారు. తల్లి, తమ్ముడి మృతదేహాలను చూసి సురేంద్రకుమార్‌రెడ్డి గుండెలవిసేలా రోదించారు. నన్ను అనాథను చేసి వెళ్లిపోతిరా.. దేవుడా ఎంత పనిచేశావయ్యా.. అంటూ విలపించాడు.

ఎమ్మెల్యే దిగ్భ్రాంతి

రోడ్డు ప్రమాదంలో ఏడుగురు దుర్మరణం చెందటంపై ఎమ్మెల్యే పెద్దారెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అందరూ ఒకే కుటుంబానికి చెందినవారు కావడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



కదిరి అర్బన్: మండలంలోని మరువతండా సమీపంలో ఉన్న వితరాయుని చెరువు వద్ద సోమవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, మృతదేహాన్ని కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. ఆచూకీ తెలిసిన వారు సంప్రదించాలని కదిరి రూరల్ పోలీసులు కోరారు.

చోరీ కేసులో ఐదుగురి అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

సోమందేపల్లి:ఐరన్ ట్రాలీలు అపహరించుకెళ్లిన కేసులో ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వివరాలను సోమవారం సోమందేపల్లి ఎస్ఐ విజయ్‌కుమార్ వెల్లడించారు. మండలంలోని రంగేపల్లి గ్రామ సమీపంలో ఆ గ్రామ సర్పంచ్ నరసింహులు ఇటుకల పరిశ్రమను నిర్వహిస్తున్నాడు. ఈ నెల 11న దుండగులు పరిశ్రమలోకి చొరబడి 72 ఐరన్ ట్రాలీలు అపహరించుకెళ్లారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో సోమవారం నిందితులను అరెస్ట్ చేశారు. పట్టుబడిన వారిలో రాంబాబు కాలనీకి చెందిన రాజు, మారుతి, షామీర్, హరీష్, వేణు ఉన్నారు. వీరి నుంచి రూ.2.52 లక్షల విలువైన ట్రాలీలు, ఓ ఆటోను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.

డీఎస్సీ అభ్యర్థులకు మరో అవకాశం

రాప్తాడు రూరల్: 98–డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. ఇప్పటికే పలువురిని ఎంటీఎస్ కింద ఇటీవల ఎస్జీటీ పోస్టుల్లో నియమించింది. అయితే కౌన్సెలింగ్‌కు గైర్హాజరైన అభ్యర్థులకు మరో అవకాశం కల్పించింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 536 పోస్టులకు గాను 480 పోస్టులను భర్తీ చేశారు. తక్కిన 56 పోస్టులు భర్తీ చేసేందుకు మెరిట్ జాబితాలోని 44 మంది అభ్యర్థులకు మాత్రమే అవకాశం ఉంటుందని డీఈఓ సాయిరామ్ పేర్కొన్నారు. ఈనెల 17న డీఈఓ కార్యాలయంలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు విద్యార్హత పత్రాలతో హాజరుకావాలని సూచించారు.

వడదెబ్బకు ఉపాధి కూలీ మృతి

గాండ్లపెంట: మండలంలోని గొడ్డువెలగల పంచాయతీ జీడి మేకపల్లికి చెందిన ఉపాధి కూలీ అన్వర్ (65) వడదెబ్బతో మృతిచెందారు. సోమవారం గ్రామ సమీపంలోని నల్లగుట్టలో ఉపాధి పనుల్లో పాల్గొన్న ఆయన కాసేపటికి సొమ్మసిల్లిపోయారు. విషయాన్ని గమనించిన తోటి కూలీలు వెంటనే చెట్టు నీడకు చేర్చి ఉపశమన చర్యలు చేపట్టేలోపు మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ అంజినప్ప, ఏపీఓ మంజునాథ్, ఎంపీపీ తాతం జగన్‌మోహన్, సర్పంచ్ ఆంజనేయులు, ఉపాధి సిబ్బంది ఆ గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాగా, మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు.

చిరుత దాడిలో ఆవుదూడల మృతి

కుందుర్పి: మండలంలోని రుద్రంపల్లిలో చిరుత దాడి చేయడంతో రైతు గంగయ్యకు చెందిన రెండు దూడలు మృతి చెందాయి. 15 రోజుల క్రితం రూ.లక్ష వెచ్చించి ఓ ఆవుతో పాటు రెండు దూడలను కొనుగోలు చేసి, గ్రామ శివారులోని తన తోటలో ఉన పశువుల పాకలో కట్టేసి ఉంచాడు. సోమవారం తెల్లవారుజామున పశువుల పాకలోకి ప్రవేశించిన చిరుత... దూడలపై దాడి చేసి, సగానికి పైగా తినేసింది. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు, పశువైద్యాధికారి అక్కడకు చేరుకుని దూడల కళేబరాలకు పోస్టుమార్టం నిర్వహించారు.

కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఆవరణలోని జిల్లా క్షయ నివారణ సంస్థ కార్యాలయంలో టీబీ సూపర్‌వైజర్, టీబీ హెల్త్ విజిటర్ పోస్టులకు అర్హులైన వారి కౌన్సెలింగ్ ప్రక్రియ సోమవారం పూర్తయింది. అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ ఆఫీసర్ డాక్టర్ అనుపమ జేమ్స్ పరిశీలించారు. మౌఖిక పరీక్ష అనంతరం శ్రీసత్యసాయి జిల్లా తనకల్లుకు సంబంధించి సూపర్‌వైజర్ పోస్టును, హిందూపురంతో పాటు అనంతపురం జిల్లా కళ్యాణదుర్గానికి సంబంధించి హెల్త్ విజిటర్ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేశారు.

పొత్తుల 'గాలి' ఏమీ చేయలేదు

- ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

హిందూపురం టౌన్: చంద్రబాబును అందలం ఎక్కించేందుకు జనసేనాని పవన్ కళ్యాణ్ నానా పాట్లు పడుతున్నారని, ఈ క్రమంలో టీడీపీ, బీజేపీతో పొత్తులు కుదుర్చుకుని వైఎస్సార్‌సీపీ వ్యతిరేక ఓట్లు చీల్చబోమంటూ ప్రకటనలు చేస్తుండడం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. కులానికి ప్రాధాన్యతనిచ్చే టీడీపీ, మతతత్వ బీజేపీతో కలిసొచ్చి పవన్ (గాలి) కళ్యాణ్ చేత ఏమీ కాదని స్పష్టం చేశారు. సోమవారం హిందూపురంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అధికారం చేపట్టిన అతి తక్కువ కాలంలోనే దేశం గర్వించేదగ్గ పాలనతో అందరి మన్నన సీఎం వైఎస్ జగన్ పొందారన్నారు. ఎప్పుడు అమరావతి జపం చేసే చంద్రబాబు.. ప్రజల బాగోగుల గురించి ఏనాడూ పట్టించుకోలేదన్నారు. లేస్తే పొత్తు, కూర్చుంటే పొత్తు తప్పా పవన్ కల్యాణ్ నోట వెంట మరో మాట రాదన్నారు. విజన్ 2047.. 2050 అంటూ చంద్రబాబు కొత్త పాటను అందుకున్నారని, అయితే బాబు విజనరీ ఏమిటో ప్రజలందరికీ తెలిసిందేనని ఎద్దేవా చేశారు. వీరంతా కలసినా.. సీఎం వైఎస్ జగన్‌ను గద్దె దింపడం చేతకాదన్నారు.

కూల్‌డ్రింక్ షాపు దగ్ధం



దుకాణంలో ఎగిసిపడుతున్న మంటలు

తాడిమర్రి: స్థానిక ప్రధాన రహదారి పక్కనే దిమ్మగుడి అల్లాబకాష్ నిర్వహిస్తున్న కూల్‌డ్రింక్ దుకాణం మంటల్లో దగ్ధమైంది. 30 ఏళ్లుగా పీర్లచావిడి పక్కన కూల్‌డ్రింక్ దుకాణాన్ని నిర్వహిస్తూ కుటుంబాన్ని ఆయన పోషించుకుంటున్నాడు. సోమవారం ఉదయం 6.30 గంటలకు దుకాణంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకుని నిప్పు రవ్వలు ఎగిసి పడ్డాయి. చూస్తుండగానే మంటలు చెలరేగి దుకాణాన్ని చుట్టుముట్టడంతో రూ.1.50 లక్షల విలువైన కూల్ డ్రింక్‌లు, వాటర్ బాటిళ్లు, రూ.70 వేలు విలువ చేసే రెండు రిఫ్రిజిరేటర్లు, రూ.3 లక్షలు విలువ చేసే కూలింగ్ మిషన్ కాలి బూడిదయ్యాయి. ఆ దుకాణానికి పక్కనే రాజస్తాన్‌కు చెందిన పూర్ణారావు నిర్వహిస్తున్న టీ స్టాల్‌లో రూ.15 వేలు విలువ చేసే ద్విచక్ర వాహనం, తోపుడు బండి కాలి పోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేశారు. సమాచారం అందుకున్న వీఆర్వో రాజకుళ్లాయప్ప అక్కడు చేరుకుని జరిగిన నష్టంపై వివరాలు సేకరించారు. కాగా, విషయం తెలుసుకున్న డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖరరెడ్డి.. ఫోన్‌లో బాధితుడిని పరామర్శించారు. అండగా ఉంటామని భరోసానిచ్చారు.

ఉద్యమాలతోనే సమస్యలకు పరిష్కారం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



మాట్లాడుతున్న రామకృష్ణ

లేపాక్షి: ఉద్యమాలతోనే సమస్యలకు పరిష్కారం దక్కుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. పోరాటాల ద్వారానే పేదలకు భూపంపిణీ సాధ్యమైందన్నారు. లేపాక్షి వేదికగా సోమవారం జరిగిన సీపీఐ రాజకీయ శిక్షణా తరగతులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. సీపీఐ ఉద్యమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాటమయ్య, మండల కార్యదర్శి శివప్ప, పట్టణ కార్యదర్శి కనిశెట్టిపల్లి వినోద్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదంలో హౌసింగ్ డీఈకి గాయాలు



అపస్మారక స్థితిలో ఉన్న డీఈ నాగరాజు

పుట్టపర్తి అర్బన్: ప్రమాదవశాత్తు చెట్టును ఢీకొన్న ఘటనలో కారు నడుపుతున్న హౌసింగ్ డీఈ నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు... బుక్కపట్నం మండలం మదిరేబైలు తండాకు చెందిన నారాయణిబాయి ఇటీవల గృహ నిర్మాణానికి సంబంధించి తలెత్తిన సమస్యపై స్పందనలో ఫిర్యాదు చేసింది. దీనిపై విచారణకు సోమవారం హౌసింగ్ డీఈ నాగరాజు.. మదిరేబైలు తండాకు వెళ్లారు. సమస్య తెలుసుకుని పరిష్కారం చూపారు. అనంతరం సాయంత్రం కారులో తిరుగు ప్రయాణమయ్యారు. వీరాంజనేయపల్లి వద్దకు చేరుకోగానే కారు నడుపుతున్న నాగరాజు నియంత్రణ కోల్పోవడంతో రోడ్డు పక్కనే ఉన్న చెట్టును కారు ఢీకొంది. ఘటనలో నాగరాజు తలకు తీవ్ర గాయమై అపస్మారక స్థితికి చేరుకున్నారు. ఆయన వెంట ఉన్న బుక్కపట్నం మండలం హౌసింగ్ ఏఈ యశ్వంత్ కుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకుని క్షతగాత్రులను సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించింది. ప్రథమ చికిత్స అనంతరం ఇద్దరినీ మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు.

వేటకొడవళ్లతో దాడి



తీవ్రంగా గాయపడిన నరసింహారెడ్డి

చిలమత్తూరు: మండలంలోని లాలేపల్లికి చెందిన యానిమేటర్ నరసింహారెడ్డిపై హత్యాయత్నం జరిగింది. ఆదివారం రాత్రి బాగేపల్లి నుంచి స్వగ్రామానికి వెళుతుండగా కళ్లలో కారం చల్లి, వేటకొడవళ్లతో నరికారు. దీంతో తలకు తీవ్ర గాయమై రక్తపుమడుగులో కొట్టుమిట్టాడుతున్న ఆయనను స్థానికులు గుర్తించి, వెంటనే పోలీసుల సాయంతో బెంగళూరులోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కాగా, హత్యాయత్నం చేసింది ఎవరు? ఎందుకు చేశారు? అనేది మిస్టరీగా మారింది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు చిలమత్తూరు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

ఏఆర్ కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం



చెక్కులు అందజేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

కొత్తచెరువు: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ మల్లికార్జున కుటుంబానికి ఎస్పీ మాధవరెడ్డి అండగా నిలిచారు. విడో ఫండ్ కింద రూ.50వేలతో పాటు ఇన్సిడెంటల్ ఛార్జెస్ కింద మరో రూ.25 వేలు ఆర్థిక సాయాన్ని సోమవారం మృతుడు మల్లికార్జున భార్య అశ్వినికి అందజేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఏఓ సుజాత, ఆర్ఐ టైటాస్, సిబ్బంది పాల్గొన్నారు.

బావిలో పడి చిన్నారి మృతి



మృతి చెందిన తన్వీష్

పెనుకొండ రూరల్: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ చిన్నారి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... పెనుకొండ మండలం కొండంపల్లికి చెందిన రమణారెడ్డి, నందిని దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వ్యవసాయంతో జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం పొలం పనులకు వెళ్లిన నందిని... వ్యవసాయి బావి వద్ద దుస్తులు శుభ్రం చేస్తుండగా... చిన్న కుమారుడు తన్వీష్ (15 నెలలు) ఆడుకుంటూ అదుపుతప్పి బావిలో పడ్డాడు. గమనించిన తల్లి గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల పొలాల్లోని రైతులు అక్కడకు చేరుకుని బాలుడిని వెలికి తీశారు. అప్పటికే నీట మునిగి ఊపిరి ఆడక చిన్నారి మృతిచెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి చెస్ టోర్నీ



ఎస్పీ శ్రీనివాసరావుతో రాష్ట్ర స్థాయి చెస్ విజేతలు

అనంతపురం: రాష్ట్ర స్థాయి చెస్ టోర్నీ సోమవారం ముగిసింది. ఆలిండియా చెస్ ఫర్ ఎవరివన్ ఫిడే రేటేడ్ చెస్ టోర్నమెంట్–2023 పేరుతో నిర్వహించిన ఈ పోటీల్లో వీర భగతీశ్వరరెడ్డి 9 పాయింట్లకు గాను 8.5 పాయింట్లు సాధించి ఛాంపియన్‌గా నిలిచాడు. రన్నరప్‌ను 8 పాయింట్లతో శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన అఫ్రిద్ టి.ఖాన్ దక్కించుకున్నాడు. తిరుపతి జిల్లాకు చెందిన లతీష్ రెడ్డి మూడో స్థానంలో నిలిచారు. గుంటూరు జిల్లాకు చెందిన అమర్ సి.ఎస్.7 పాయింట్లతో నాల్గో స్థానంలో అనంతపురం జిల్లాకు చెందిన కటారి భవన కృతి ఐదో స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా విజేతలను ఎస్పీ కె.శ్రీనివాసరావు అభినందించి నగదు పురస్కారాలు, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో కేవీవీ శర్మ, సురేంద్రకుమారరెడ్డి, డాక్టర్ సుప్రజాచౌదరి, ఆదిరత్నకుమార్, అనంతపురం చెస్ అసోసియేషన్ గౌరవ చైర్మన్ బాలరాజు, టోర్నీ డైరెక్టర్ ఉదయ్‌కుమార్ నాయుడు, చీఫ్ ఆర్బిటర్ ఫణికుమార్, డిప్యూటీ చీఫ్ ఆర్బిటర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.